



# ఏకాకి పయనం

పాలడుగు వెంకటేశ్వర రావు

పొద్దు పడమటి కొండమీద వాలిపోయింది.

కోపంతో కందిన మొహాలు పెట్టుకొని ఆ దిక్కున నాల్గయిదు మబ్బు తునకలు ఆకాశంలో అక్కడక్కడ వ్రేలాడుతున్నాయి. ఎర్రగా దుమ్ము లేపుకుంటు గేదెల గుంపులు ఇళ్ళ మొహాలు పట్టాయి, వాటి వెనకాలే గొడ్డ కాడ బుడ్డాళ్ళు గోలకాయలు విసిరేస్తూ ఆడుతూ, అరుచుకుంటు వస్తు వున్నారు. చెరువులో బండలమీద వులికి ఆరేసిన బట్టల మూటల్ని మూపుల మీద పెట్టుకుని పకపక ఊసుకబుర్లు చెప్పుకుంటు, పిటపిటలాడుతూ చాకలి పడుచులు వూరిదారి పట్టారు. వంతెన దగ్గర బస్సు ఆగింది. అందులోంచి మాసిన బట్టల్తో లోతుకుపోయిన కళ్ళతో 'కరేపాకు' దిగాడు. దిగి, నీర్సంగా వంతెన గోడమీద కూలబడ్డాడు. అవతల రెండు ఫర్లాంగుల దూరంలోవున్న వూళ్ళోంచి రకరకాల కలకల ధ్వనులు వినవస్తున్నాయి. అంతలో మసక చీకట్లు కమ్ముకుని వచ్చాయి. వంతెన దగ్గర టీ దుకాణంలో దీపంవెలిగింది. తన్మయత్వ నిండిన కళ్ళతో అలాగె వూర్ని చూస్తూ కూర్చుండిపోయాడు కరేపాకు.

వంతెన గోడమీద కూర్చునివున్న కరేపాకుని చూసి చాకలి పడుచులు గుసగుసలు పోయారు.

'ఎవరా మనిషి?'

'ఎక్కడ?'

'అదే ఆ వంతెన గోడమీద కూర్చున్నాడు!'

'ఎవరు బాబూ?' దగ్గరకెళ్ళి గుచ్చిగుచ్చి చూస్తూ అడిగింది ఒకామె.

'నేనేలే' అన్నాడు కరేపాకు నీర్సంగా.

'నేనేనంటే?!'

'పుణ్యావతిగారి చిన్నబ్బాయిని.'

'ఓహో! నువ్వా బాబూ! ఎప్పుడొచ్చావు?'

'ఇప్పుడేలే.'

'ఇక్కడ కూర్చున్నావేం బాబూ? వూళ్ళోకి పదరాదా?'

'వస్తాలే. మన్నయ్యకి చెప్పు. నే వచ్చానని' అన్నాడు కరేపాకు.

'అట్లాగే' అని వాళ్ళు వూరివయపుకి సాగిపోయారు; కరేపాకు, కరేపాకు అంటు గుసగుసలు పోతూ.

చలిగాలి మొదలయింది. చిమ్మ చీకట్లు క్రమ్ముకున్నాయి. సైకిళ్ళేసుకుని బస్తీకి వెళ్ళినవాళ్ళు రయ్యి రయ్యిన వూరివయిపుగ కబుర్లు చెప్పుకుంటు వెళ్తున్నారు. పొలాలకి వెళ్ళి బళ్ళు తోలుకుంటు మెడల్లోని గంటలు మోగించుకుంటూ వూళ్ళోకి-వూళ్ళోకి సాగిపోయాయి ఎద్లు. ముసగదీసుకుని కూర్చుండిపోయాడు కరేపాకు మొహం చెల్లక అలాగే కూర్చుండిపోయాడు, మరి ఏం తోచక.

'ఎవ్వరా అబ్బాయి అది?' కిర్రు చెప్పులు మోగించుకుంటు వస్తున్న కనకయ్య ఆగి అడిగాడు.

'నేనేనే' అన్నాడు నీర్సంగా.

గొంతు గుర్తుపట్టి 'కరేపాకా?' అన్నాడు కనకయ్య.

'ఆఁ'

'అరె! ఎప్పుడొచ్చావురా?! ఇక్కడ కూర్చున్నావేం?'

'ఇప్పుడేలే.'

'రా. పోదాం.'

'ఏమంది: వస్తా లే 'పద మన్నాయికి చెప్పు నే వచ్చానని'

'అట్లాగేలే. త్వరగా వచ్చెయి. దినెమ్మ తెగ చలిగా వుంది.'

'అలాగేలే బాబాయ్' అన్నాడు కరేపాకు.

కనకయ్య సాగిపోయాడు.

చూస్తూ వుండగానే పొద్దుపోయింది బాగా. కరేపాకు కళ్ళు చీకట్లోకి గుచ్చి గుచ్చి చూస్తు వుండిపోయేయి. చీకటి చీకటిగానే మిగిలిపోయింది. ఆ చీకట్లోంచి ఎవరూ నడిచి వచ్చి 'రా. పోదాం' అని చెయ్యి పట్టుకుని లేవదీయలేదు అతన్ని.

టీ కొట్లో బల్లలు కాళీ అయేయి—దీపం తీసేసి, తలుపులు వేసుకున్నాడు దుకాణం యజమాని. లాస్టు బస్సు వచ్చి ఆగకుండానే వెళ్ళిపోయింది. వూరు మునగదీసుకుని నిద్ర పోవటానికి సిద్ధపడు వుంది. అయినా అతను అలాగె కూర్చుని నిరీక్షిస్తు వుండిపోయేడు.

కరేపాకు నిరీక్షణ, నిరాశనె తెచ్చిపెట్టింది అతనికి.

కడుపులో పేగులు ఆకలికి అరిచాయి.

అయినా కళ్ళు చించుకుని వూరివైపు పరుచుకున్న చీకట్లలోకి చూడటం మానలేదు. చలిగాలి వుధృతి నందుకుని ఎముకల్ని కొరుక్కుతినటం మొదలెట్టింది.

అతను ఆ వూళ్ళోనే పుట్టాడు! పెరిగేడు; గారాబంగా పెరిగేడు. అల్లరి చిల్లరగానె తిరిగేడు. తల్లి పుణ్యావతి మొత్తుకునేది. బుద్ధిగా వుండరా అని చెవినిల్లుగట్టుకుని పోరు పెట్టేది. తన పోకిళ్ళకి అయినవాళ్ళు అందరూ చీదరించుకునేవారు. అన్న అనంతయ్య గుర్రుగా చూసేవాడు. అక్క అండాళ్ళమ్మ తిట్టిపోసేది. గుణాభాయి వున్నవి లేనివి అతనిమీద కల్పించి వూరి వాళ్ళకి చెప్పేది. అలాగ అతన్ని చెడిపోయినవాడుగా ముద్ర పడింది.

చిన్నప్పుడు ఒకసారి అర్థరాత్రిపూట కనకయ్యగారి దొడ్లోకి చొరబడ్డాడు. గుబురుగా పెరిగిన కరేపాకు చెట్టునుంచి అందినంత ఆకు దూసుకుని రాబోయేడు. కనకయ్య లేచి వెంటబడి పట్టుకున్నాడు. నలుగుర్ని లేపి అల్లరిచేసేడు. అతన్ని అన్న అనంతయ్య, గదిలో పెట్టి పిడిగుద్దులు గుద్దేడు. అన్నీ మౌనంగా భరించేడు. వదిన గుణాభాయి నవ్వుకుంది. 'కరేపాకు, కరెపాకు' అంది. ఆ పేరే వచ్చింది. అసలు పేరు మరుగున పడిపోయింది. అదొక చిత్రమయిన వయస్సు. విచిత్రమయిన ఆలోచనల తీరు లెన్నులు. అటువంటి పన్ను అవసరం వుండి కాదు. అలాగ అన్పించింది. అందులో థ్రిల్

# ఎక్కడికీ పయనం

వుందనిపించింది. వెంటనే ధైర్యంగ చేసేడు. పట్టుబడి అభాసుపాలయేడు. చదువులేదు, పనీ పాటా లేదు. పిచ్చి ధైర్యంతో 'ఎడ్వంచర్సు' చేసేడు. అవన్నీ అపకీర్తినే తెచ్చి పెట్టేయి. నలుగురిలో చులకనవటమే మిగిలింది. ముద్రపడింది. అదీ మొండితనాన్నె తెచ్చిపెట్టింది. మొండిపనుల్నే చేయించింది.

అండాళ్ళమ్మ పెళ్ళయింది. అత్తారింటికి పోతూ 'బుద్ధిగా వుండరా' అని మొత్తుకుంది. నవ్వాడు కరేపాకు. అప్పుడె తండ్రి పోయాడు. ఇక అతనికి అదుపు పూర్తిగ పోయింది. విసిగిపోయిన అనంతయ్య తమ్ముడ్ని గురించి పట్టించుకోవటమె మానేసాడు.

'పెళ్ళిచేసుకోరా' అని పోరు పెట్టింది తల్లి. ససేమిరా వద్దన్నాడు – చివరికి విసిగి 'పోన్లే సరే' అన్నాడు. అప్పుడు అతన్కి పిల్లనివ్వటానికి ఎవరూ ముందుకే రాలేదు. ఎవరయినా వచ్చినా గుణాభాయి మాటలువిని అట్నుంచటే పారిపోయారు 'ఇదినీకు తగదు' అని కోడలికి హితవు చెప్పింది పుణ్యావతి 'నను. లేని మాటేం అనటంలేదు' అని పోట్లాటకి దిగేది గుణాభాయి. 'ఖర్మ ఖర్మ' అనుకుని నోరుమూసుకొనేది పుణ్యావతి.

అలా అయిపోయింది.

—ఏవిటో అంతా అలా అయిపోయింది. కాలం దొరలి పోయింది.




ఇపుడు తిరిగి చూసుకుని ఆలోచిస్తే అతనికే నవ్వు వస్తుంది అంతా గుర్తువచ్చి తనిమూసి తనే నవ్వుకుంటాడు. అతన్ని చూసి తెలిసిన నలుగురూ కూడా నవ్వుతారు. కాని అతనిలోని ఆ గొప్ప గుణాన్ని గుర్తించరు – కాని ఆ అర్హతని తాత్కాలికంగానైనా తెచ్చిపెట్టుకోరు.

తండ్రి పోగానే వాటాలు వేసి ఆస్తి పంపకాలు చేసేడు అనంతయ్య. కాదని ఎవరూ అనలేదు. అపుడు అతను చూపించిన ఆ స్వార్థాన్ని ఎవరూ వేలెత్తి చూపలేదు. ప్రయోజకుడుగా ముద్ర పడిన వాడు చేసే అప్రయోజకపు అవినీతి పనులు, చలామణీ అయిపోతాయి సునాయాసంగా. అలాగే సాగాయి అనంతయ్య చెయిదాలు.

ఆ తర్వాత తమ్ముడికి అవసరమయినపుడల్లా డబ్బు సర్ది ఒకటొకటిగా అతని ఆస్తిపాస్తులన్నీ స్వాహా చేసేడు అనంతయ్య. అంతా తెగ నమ్ముకుని వూరువదిలి పెట్టి తెగిన గాలిపటంలాగ గాలికి కొట్టుకుపోయేడు కరేపాకు.

పట్నంచేరి రకరకాల వ్యాపారాలు చేసేడు. పుష్కలంగా డబ్బు వున్నంతవరకు పుష్కలంగా స్నేహితులూ దొరికేరు. డబ్బుతో పాటుగా వాళ్ళూ ఎడమెడంగా పోయేరు.

ఒకో జీవిత పయనం అలాగ తాడు బొంగరం లేక సాగిపోవాలనుండవచ్చు. అలాగె అయింది అతని ప్రయాణం. అందుకు అతని బాధ్యతా లేకపోలేదు. ఆ బాధ్యత గుర్తించే సమయానికి అంతా అయిపోయింది!

కరేపాకు మనిషే. హృదయం వుంది. మనసు వుంది. మమతలూ వున్నాయి. ఆశాబంధాలు పెరిగాయి. కాని వాటికి గుర్తింపు లేదు. అతను మంచి మనసుతోనే బతకాలని ప్రయత్నించాడు. గాని అతను తలపెట్టిన ప్రతి పనీ విఫలమయింది. డబ్బు పోయింది. స్నేహాలు విచ్ఛిన్నమయాయి. బంధువులు చిన్న చూపు చూసారు. పైగా అప్రయోజకుడని ముద్రవేసి చాతనయినంతవరకూ అతన్ని హింసించటానికి ప్రయత్నించారు.

బతుకుబాటలో అతను ఓడిపోయేడు!

'నా అన్న' వాడు లేనివాడయేడు !!

ముద్రపడి చెడిపోయినవాడుగా మిగిలి పోయేడు!!!

అయినా ఓటమిని చిరునవ్వుతోనె స్వీకరించాడు అతను. చివరిదాకా పోరాడుతూనె

బ్రతకాలని నిశ్చయించుకొన్నాడు. మళ్ళీ తిరిగి లాగుకుపోతున్న జీవిత ప్రవాహపు ఉరవడిని ఎదిరించలేక తలవంచటానికే నిర్ణయించుకొన్నాడు.

నిజమే – అతను ఎన్నో చెడ్డపన్లూ చేసేడు. అవి అందరి దృష్టిలోకీ వచ్చాయి. తెలియనితనం, ఆవేశం, కుర్రతనంవల్ల అలా జరిగింది అందువలన అనేక సమస్యలు అతనికి ఎదురయేయి.

ఐనా అతనే కొన్ని మంచి పనులూ చేసేడు. అవి అతనికి తప్ప మరొక మనిషికి తెలియదు. దయ, జాలి, మానవత్వం అనే గుణాలు అతనిలో చోటు చేసుకొనటంవలన ఆ మంచిపన్లు జరిగేయి. అందువలన అతనికి సంతృప్తి, శాంతి కలిగి గుండెలు ఆనందం నింపుకొన్నాయి.

ఎంతో వయసు నిండక పోయినా–ఇప్పుడు అతను జీవితపు చరమ దశని చేరుకున్నా ననుకుంటున్నాడు. అందువల్లనే – అతనిలోని మమతానుబంధపు రుచులు ఉవ్వెత్తున పొంగి–అతన్ని కట్టిపడేసి లాగుకొని వచ్చాయి; వచ్చాడు. అతన్ని తిన్నగా గమ్యస్థానం చేర్చటాన్కి అతనిలోని మొహమాటం సిగ్గూ గతచరిత్రా అడ్డువచ్చాయి అతనికి!

ఇప్పుడు అనంతయ్య వూళ్ళో మోతుబరి రైతు. ఆండాళమ్మ కూడా భర్తతో పాటు ఆ వూరే చేరి వచ్చ వచ్చగానే వుంది. కరేపాకే ఆ వూర్ని వదిలి అందరికీ దూరమయాడు ఏన్నాళ్ళుగానో.

కరేపాకు చాకలి చిన్నమ్మతో చెప్పాడు. 'మన్నయ్యతో చెప్పు; నే వచ్చానని' అని ఆమె అన్నయ్యతో చెప్పే వుంటుంది. అయన రాలేదు, రాడేమో !

అతనే కనకయ్యతో చెప్పాడు 'మక్కాయి'కి చెప్పు నే వచ్చానని' అని. కనకయ్య భోళా మనిషి. ఇంటికయినా వెళ్ళకుండానే తిన్నగా వెళ్ళి ఆండాళ్ళమ్మకి చెప్పే వుంటాడు అయినా ఆమె కూడా రాలేదు. రాదేమో ! వ్చ్.

వాళ్ళు ఇంకేం వస్తారు? అర్ధరాత్రి అవుతోంది.

ఏవరొస్తారు, ఇంక ? తనకి వాళ్ళు కావాలనుకొన్నా, వాళ్ళకి తను అవసరం కాదన్పించవచ్చు.

నేను, మన్నయ్య, మక్కాయి అని కొన్ని క్షణాలో ఈ జీవుడు తాపత్రయం, ఆపేక్ష పడటమే గాని– అక్క ఎవరు ? అన్న ఎవరు ? తమ్ముడు ఎవరు ? అవసరాలే ప్రాతిప్రదికగా స్వార్థమే మార్గదర్శిగా జీవితాల్లో పడి కొట్టుకుపోతు వున్న ఈ మనుషుల 'విలువల్ని' గుర్తించటం జరుగుతుందా ?

ఏమో ! ఇంక తనకి ఆ వూరికి ఋణం తీరినట్టే. నీర్సంగా – నిరాశతో కరేపాకు లేచాడు.

చీకట్లోనే వెళ్ళి పోవటాన్కి లేచాడు. ఒంట్లో ఓపికలేదు. అయినా ఆ చీకటిని, చలిని ఎదుర్కొని వెళ్ళి పోవటాన్కి లేచాడు. విచారంగానే కరేపాకు– నాలుగడుగులు వేశాడు అంతలోనే –

'బాబూ! కరేపాకూ' అన్న కాతర స్వరం అతన్ని పట్టి ఆపింది. కరేపాకు నిలబడి ఆశ్చర్యంగానే

త్వరలో

ఆమెకేం కావాలి?

ప్రారంభం!

వెనుదిరిగి చూసాడు. అంత దూరాన మినుకు మినుకు మంటున్న వెలుగు ! క్రమక్రమంగా ఆ వెలుగు దగ్గరయింది.

'బాబూ !' మమత నిండిన స్వరం.

'ఎవరదీ?' అన్నాడు కరేపాకు ఆశ్చర్యంగా

'బాబూ నేనురా. మీ అమ్మని.'

ఆనందంతో, ఆశ్చర్యంతో పరిగెత్తి, వణుకుతూ వున్న ఆ ముసలి శరీరాన్ని కావలించుకొని ఆనందబాష్పాలు రాల్చాడు, కరేపాకు. కన్నీరు వాగులై ప్రవహించింది.

'ఒరే ! కరేపాకూ ! 'మెక్కాయ్'కి 'మెన్నయ్య'కి కూడా చెప్పేనా, కాని వాళ్ళు రాము పొమ్మన్నారు. నువ్వు అనకపోయినా నేనే 'మెమ్మ'కి చెప్పాను. పిచ్చిది. అప్పట్నుంచీ పోదాం రమ్మని నా ప్రాణం తీసిందనుకో నాకే పన్లు తెమిలేటప్పటికి ఆలస్యమయింది.'

అన్నాడు కనకయ్య, లాంతరు పట్టుకుని ఆత్రంగా

'రా బాబూ పోదాం' అంది పుణ్యావతి చివరికి. 'ఎక్కడికి రానమ్మా ?' దిగులుగా

'మనింటికేరా' అంది పుణ్యావతి గద్గద స్వరంతో

కరేపాకు నవ్వుకున్నాడు. 'వాట్నాడ వేంరా ?' మొత్తుకుంది పుణ్యవతి

కరేపాకు నవ్వాడు 'అబ్బాయి, నువ్వు అప్పుడూ, ఇప్పుడూ ఇంతేరా. రమ్మని 'తల్లి' అంతగా బ్రతిమాలుతున్నపుడు కాదనటం మంచిది కాదురా.' అన్నాడు కనకయ్య. 'ఇటువంటప్పుడే కోపతాపాలేవన్నా వుంటే మర్చిపోవాలి మరి' అన్నాడు. నవ్వుకున్నాడు కరేపాకు.

నవ్వి నవ్వి – కరేపాకు కళ్ళంట నీరు చిమ్మింది

'బాబాయ్ ! చివరిసారిగా మన్నయ్యని, మక్కాయిని చూడాలని వొచ్చానను కుంటున్నావు? అందుకేగా మరి కానీ వాళ్ళని చూడలేక పోయాను. అమ్మని చూడాలని ఈ 'పిచ్చాడు' అనుకోలేదు - అనుకోకపోయినా నీ దయవల్ల చూసాడు నా కడుపూ, మనసూ నిండింది చాలు బాబాయ్ ఇంక నాకేం అవసరం లేదు వస్తా బాబాయ్, అమ్మా వస్తా, చల్లని నీ మనసుని నేను చచ్చిపోయే దాకా గుర్తు పెట్టుకుంటానమ్మా.'

'ఒరేయి. ఏంట్రా అది ! ఎక్కడికి పోతావ్ !' కనకయ్య అతన్ని పట్టుకున్నాడు

'పోవాల్సిందే బాబాయ్ పోలీసులు నా వెంట పడుతున్నారు. నేను ఒక హత్య కేసులో ఇరుక్కున్నాను. రేపయినా నన్ను పట్టుకుని ఉరి తీస్తారు. తప్పదు అందుకే చివరిసారిగా అందర్నీ చూడాలని వచ్చాను. నా అమ్మని చూసాను – నా వూర్ని చూసాను – చాలు. వస్తా బాబాయ్ కాని నేను నిజంగా చెడ్డ వాడ్ని కాదు బాబాయ్ నాకు న్యాయం జరగ లేదంతే. అది నా కర్మ, అన్యాయాన్ని సహించలేక ప్రతీకారంగా ఈ హత్య చేసాను శిక్షకి సిద్ధంగానే వున్నాను.' అంటూ కనకయ్య చేతుల్ని వదిలించుకొని చీకట్లో నడిచిపోయాడు, కరేపాకు. ఏడుస్తు వున్న పుణ్యావతిని పట్టుకొని వూరివైపు నాలుగడుగులు వేసాడు కనకయ్య అంతలోనే అక్కడికి పోలీసు వ్యాను వచ్చి ఆగింది !